బత్తిని సోదరులకు సన్మానం

బేగంబజార్, జూన్ 6 ప్రభాతవార్త

చేపప్రసాదం పంపిణీ చేసే బత్తిని సోదరులను ఉత్తర భారతి సంఘ్ చైర్మన్ అశోక్‌సింగ్ ఎగ్జిబిషన్ మైదానంలోసన్మానించారు. ఈ సందర్బంగా అశోక్ సింగ్ మాట్లాడుతూ ఉబ్బసంవ్యాధితో భాధపడేరోగులకు ప్రతి ఏడు బత్తిని సోదరులు చేపప్రసాదం పంపిణీచేస్తారన్నారు. ఉచితంగా ప్రసాదాన్ని అందచేసే బత్తిన సోదరులు హరినాథ్‌గౌడ్, విశ్వనాథ్‌గౌడ్, ఉమామహేశ్వరగౌడ్‌లను ఆయన సన్మానించారు. బత్తినిసోదరులకు రాష్ట్రప్రభుత్వం సహాయసహకారాలు అందించాలనికోరారు. ఉత్తర భారతిసంఘ్ ఆధ్వర్యంలో చేపమందుపంపిణీ సందర్బంగా అల్పాహారాలు అందివ్వడం జరుగుతుందనితెలిపారు. ఈకార్యక్ర మంలో జెపి చౌబే, మురళీమోహన్‌సింగ్, సుభాష్ శ్రీవాత్సవ్, విజయశంకర్ పాండే,అశ్రిత్‌కుమార్‌జైస్వాల్‌తదితరులు పాల్గొన్నారు.

పక్కా నివాసాలను నిర్మించాలి

బేగంబజార్,జూన్ 6 ప్రభాతవార్త

గుడ్డి మల్కాపూర్‌లోని వాంబే కాలనీలో ప్రమాదవశాత్తు కాలిన గుడిసెల స్థానంలో పక్కా నివాసాలు నిర్మించిఇవ్వాలని పేదప్రజల పార్టీ రాష్ట్ర అద్యక్షులు దాసరి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖాళీ పోయిన గుడిసెల ప్రాంతాన్ని శనివారం ఆయన సందర్శించి భాదితులను పరామర్శించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి వెంటనే పక్కా ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నారు. నష్టపోయిన భాదితులందరికి ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రెండు లక్షల రూపాయలను ఇవ్వాలన్నారు.

గుడిసె వాసులకు ఆర్థిక, దుస్తులు సహాయం చేసిన లోక్‌సత్తా

మెహిదీపట్నం, జూన్ 6 ప్రభాతవార్త

శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు మంటలు ఎగిసి గుడిసెలు ఆహుతైన బాధిత ప్రజలకు కార్వాన్ నియోజకవర్గం లోక్‌సత్తా నాయకులు అండగా నిలిచి, చేతనైనంత వరకు సహాయం చేశారు. లోక్‌సత్తా నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాలకు చెందిన నాయకులు పి.వెంకటేశ్వర్‌రావ్, మాణిక్‌ప్రభు, యువసత్తా రాష్ట్ర అద్యక్షుడు దాసరి రత్నంలు స్పందించి శనివారం బాధిత గుడిసె వాసులను పరామర్శించారు. మీకు న్యాయం జరిగేంత వరకు లోక్‌సత్తా పార్టీ మీకు అండదండలు అందించడంతో పాటు చేతనైన సహాయం చేస్తుందని నాయకులు బాధితులకు భరోసా ఇచ్చారు. అర్ధరాత్రి దాటిన తరువాత ఒకేసారి మంటల రేగడంతో ఇక్కడి ప్రజలంతా భయంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరిగెత్తారని, ఈ సంఘటనలో కట్టు బట్టల తప్పా మిగితా బట్టలు, నగలు, నగదు, ఆహర ధాన్యాలను కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రమాదాలుసంభవించినప్పుడు తోటి ప్రజలంతా బాధితులకు అండగా ఉండి తమకు తోచినంత ఆర్థికరూపంలో, దుస్తుల రూపంలో, ధాన్యాల రూపంలో సహాయం చేసి ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఈ విషయం చెప్పడమే కాదు ముందుగా నాయకులే తమకు తోచినంత డబ్బులను జోలెలో వేసి, దుకాణాలు, అపార్టుమెంట్లు తిరిగి డబ్బులు, దుస్తులు, ఆహారధాన్యాలు, ఆహార పదార్థాలను అడుక్కొని తీసుకువచ్చి బాధిత ప్రజలకు అందజేశారు. దీంతో బాధితులు ఎవరు వచ్చినా అయ్యో పాపం అని నిట్టూర్చేవారే తప్పా మా ఆకలి బాధను తీర్చేలేదని, లోక్‌సత్తా నాయకులు తమ క్షుద్బాధను తీర్చారని బాధిత ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఏ పని చేసినా ఇతర పార్టీలకు భిన్నంగా, వినూత్నంగా బాధితులకు న్యాయం జరిగేలా చేయడంలో లోక్‌సత్తా ప్రత్యేక శైలిని అవలంభిస్తుందనేందుకు ఇదో నిదర్శనము మాత్రమేనని నాయకులు స్పష్టం చేశారు. ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు బాధితులు ఆకలిబాధతో అల్లాడుతుంటారని అలాంటి వారి పరిస్థితిని చూసి జాలిపడడం మానుకొని చేతనైన సహాయం చేయడం నేర్చుకోవాలని లోక్‌సత్తా నాయకులు హితవు పలికారు. శుక్రవారం ఉదయం ఇతర పార్టీల నాయకులంతా వచ్చి కేవలం పరామర్శించి వెళ్లారే తప్పా ఎవరూ కూడా తమ అవసరాలను గుర్తించలేకపోయారని, శనివారం లోక్‌సత్తా పార్టీ నాయకులు తమ అవసరాలను తీర్చేందుకు జోలెపట్టి అడుక్కోవడం తమను కలిచివేసిందని, తమ బాధలను తీర్చేందుకు ఆ పార్టీ నాయకులు రోడ్ల వెంబడి తిరిగి తెచ్చిన డబ్బులు, ధాన్యం, దుస్తులను మాకు అందజేయడం మా జీవితంలో మరువలేమని బాధిత ప్రజలు పేర్కొన్నారు. రెవెన్యూ యంత్రాంగం స్పందించి ఆరువేల రూపాయల చెక్కులను పంపిణీ చేసి చేతులు దులుపుకుందని, వారిచ్చిన ఆరువేల రూపాయలతో మాకు ఏ అవసరాలు తీరడం లేదని, పక్కా ఇళ్ల నిర్మించి ఇచ్చి తమను ఆదుకోవాలని బాధితులు కోరారు. బాధితుల విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, సాధ్యమైనంత త్వరగా వీరి సమస్యను తీర్చేందుకు కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. బాధితులను ఆదుకునేందుకు లోక్‌సత్తా నాయకులు చేపట్టిన జోలె కార్యక్రమానికి విద్యావంతుల నుంచి మంచి స్పందన రావడంతో ఆదివారం కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగించి వచ్చిన డబ్బులను, దుస్తులను బాధిత ప్రజలకు అందజేసి ఆదుకుంటామని నాయకులు స్పష్టం చేశారు.

గుడిసె వాసుల కోసం స్థానిక ప్రజల నుంచి పాతబట్టలను తీసుకొంటున్న లోక్‌సత్తా నాయకులు.

అవస్థలు పడుతున్న అగ్ని ప్రమాద గుడిసెవాలు

మెహిదీపట్నం, జూన్ 6 ప్రభాతవార్త

శుక్రవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంతో 35గుడిసెలకు చెందిన ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆసిఫ్‌నగర్ మండల పరిధిలోని గుడిమల్కాపూర్ ప్రాంతంలో గుడిసె బాధితులు శుక్ర,శనివారాలు తలదాచుకునేందుకు ఏ సదుపాయం లేకపోవడంతో పిల్లా,పాపలతో ఎండకు తీవ్రఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు 40డిగ్రీలుఉండడంతోపలువురుచిన్నారులువడదెబ్బతో ఇబ్బందులు పడుతున్నారు. ఓవైపు రోజంతా కష్టపడి దాచుకున్న డబ్బులు, ఆహార ధాన్యాలు, కట్టుకునే బట్టలు అగ్నికి ఆహుతై పెద్దలు వ్యధ చెందుతుంటే మరోవైపు వడదెబ్బతో కొంతమంది చిన్నారులుఇబ్బందులుపడడం వారిని మరింత ఆందోళనకు గురి చేస్తుంది. రెవెన్యూ అధికారులు ఆరువేల రూపాయల చెక్కులను అందజేయడం కంటే ఆ డబ్బులతో రేకుల షెడ్లను నిర్మించి ఇచ్చి ఉంటే ప్రజలంతా వాటిల్లో తలదాచుకునే వారని స్థానికులుఅభిప్రాయపడుతున్నారు. గుడిసెలు తగులబడడంతో ఆ ప్రాంతమంతా స్మశానంలోని బూడిద వలే అంతా కాలిపోయిన కాగితాలు, దుస్తులే కనిపించాయి. 35గుడిసెలలో పిల్లలు, పెద్దలతో కలిపితే సుమారు వంద మంది వరకు నివాసముంటున్నారు. వీరంతా ఎలాంటి నీడలేకపోవడంతో శుక్ర,శని రెండు వారాల్లో ఇబ్బందులు పడ్డారు. కనీసం తాగేందుకు నీళ్ల పట్టుకురావాలన్నా వీరి వద్ద ఎలాంటి బిందెలు లేకపోవడంతో మధ్యాహ్నపు వేళల్లో తాగునీటికి తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. శనివారం లోక్‌సత్తా నాయకులు మానవతా దృక్పదంతో ఆలోచించి జోలెపట్టి దుస్తులు, దుప్పట్లు స్థానిక ప్రజల వద్ద అడుక్కొని తీసుకువచ్చి బాధిత ప్రజలకు ఇవ్వడంతో వారిలో కొంత ఊరట కనిపించింది. కట్టుకునేందుకు ఈ దుస్తులు, రాత్రిల్లో పడుకునేందుకు దుప్పట్లు చాలా వరకు తమకు ఉపయోగపడుతాయని స్థానికులు ఆనందపడ్డారు. మా కోసం లోక్‌సత్తా నాయకులు పడిన కష్టం మా జీవితంలో ఎప్పుడూ మరువలేమని బాధిత ప్రజలు పేర్కొన్నారు. అధికారులు, ఇతర పార్టీల నాయకులు వచ్చి మీడియా ముందు హడావుడి చేసి వారి డబ్బాను కొట్టుకున్నారు తప్పా ఎవరూ తక్షణం మా అవసరమేంటో గుర్తించలేదని, ఒక్క లోక్‌సత్తా నాయకులు మాత్రం మా అవసరాలను సకాలంలో గుర్తించి తీర్చారని పేర్కొన్నారు. మొత్తం మీద గుడిసె బాధితులు తాగేందుకు నీరు లేక, తలదాచుకునేందుకు గూడులేకరెండురోజులపాటు నరకయాతన అనుభవిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం కూడా మరో మూడు గుడిసెలు పాక్షికంగా కాలిపోయాయి. పగటి పూట కావడం వలన స్థానికులు సకాలంలో గుర్తించి ఆర్పివేశారు. శనివారం ఈ గుడిసె బాధితులను కాంగ్రెస్ నాయకుడు జి.ప్రహల్లాద్ యాదవ్, బిజెపి నాయకుడు బంగారి ప్రకాశ్, పిఆర్‌పి నాయకుడు వెంకటకృష్ణలు పరామర్శించారు. బాధిత ప్రజలు మాత్రం మా కష్టాలను చూసి జాలిపడే వారు మా వద్దకు రావద్దని, మాకు చేతనైన సహాయం అంటే దుస్తులు, ఆహారధాన్యాలు అందజేస్తే చాలని కోరుతున్నారు. కేవలం పత్రికలకు ఎక్కడానికి కొంతమంది నాయకులు తమ చుట్టూ వస్తున్నారని, అలాంటి వారు తమ వద్దకు ఇక రావద్దని బాధితులు స్పష్టం చేశారు.

గుడిసెలు అంటుకోవడం వలన పనికిరాకుండా పోయిన బియ్యం, పప్పలను చూపిస్తున్న బాధిత ప్రజలు.

సమస్యలతో సతమతమవుతున్న పేదలు

మెహిదీపట్నం, జూన్ 6 ప్రభాతవార్త

పాలకుల నిర్లక్ష్యం వెరసి నిరుపేదలు నివసించే బస్తీలు అపరిశుభ్రతకు ఆనవాలుగా మారుతున్నాయి. కార్వాన్ నియోజకవర్గంలోని అల్లూరి సీతారామరాజునగర్, శ్రీరాంనగర్, శివాజినగర్, అంబేద్కర్‌నగర్ తదితర ప్రాంతాలలో డ్రైనేజి నీరు అస్తవ్యస్థంగా పారడంతో పాటు వారాల తరబడి చెత్తకుండీలలోని చెత్తను తొలగించకపోవడం వలన బస్తీలన్నీ దుర్గంధమయంగా మారాయి. తద్వారా స్థానిక ప్రజలు అంటు రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ముఖ్యంగా అల్లూరిసీతారామరాజునగర్, గుడిమల్కాపూర్ ప్రాంతాలలో చెత్త సమస్య తీవ్రరూపం దాల్చింది. వేసిన చెత్తవారాలతరబడితొలగించకపోవడంతో అది కుళ్లి దుర్వాసనను వెదజల్లుతుంది. దీంత గుడిమల్కాపూర్ మార్కెట్‌యార్డు పక్క నుంచి వెళ్లే వందలాది వాహనదారులు ఈరోడ్డుపైరావాలంటనే జంకుతున్నారు. అల్లూరిసీతారామరాజునగర్‌లో ఎక్కువ మంది నిరక్ష్యరాస్యులు, దినసరి కూలీలు, చెత్త కాగితాలు ఏరుకునే వారే అధికంగా ఉండం వలన ఈ ప్రాంతాన్ని పాలకులు ఓటు బ్యాంకుగానే చూస్తున్నారు తప్పితే వారి సమస్యలను పట్టించుకోవడం లేదనేందుకు ఇక్కడ నెలకొన్న సమస్యలే నిలువెత్తు నిర్శనాలు, కేవలం అధికారం కోసం ఎన్నికల ముందు తమ ప్రాంతాలకు వచ్చే అన్ని పార్టీల రాజకీయ నాయకులు కల్లబొల్లి మాటలు చెబుతూ గద్దెను ఎక్కినాక మా సమస్యలు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రమం వ్యక్తం చేస్తున్నారు. అస్తవ్యస్థమైన డ్రైనేజి వ్యవస్థ, సకాలంలో తొలగించని చెత్తల వలన తమ ప్రాంతంలోని ప్రజలు అంటు రోగాల బారిన పడుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో నిర్వహించిన అన్ని ప్రజాపథం కార్యక్రమాలలో తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోలేదని స్థానికలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమవద్దకు వచ్చిన అధికారులు నాయకులు ఇక్కడ ఓ ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు కానీ నేటికీ ఆచరణకు నోచుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కార్వన్ నియోజకవరగంలో శానిటేషన్ అధికారుల అలసత్వం వలన ఎక్కడికక్కడా డ్రైనేజీనీరు పొంగుతూ స్థానికుల పాలిట శాపంగా మారింది. అడుగడుగునా చెత్త, అస్తవ్యవస్థమైన డ్రైనేజి పందులు,కుక్కలు విచ్చల విడిగా తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు వాపోతున్నారు. సకాలంలో అధికారులు చెత్తను తొలగించకపోవడం వలన చెత్తంతా కుళ్లి దుర్వాసనను వెదజల్లుతుంది. ఈ సమస్యను అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అల్లూరి సీతారామరాజునగర్, గుడిమల్కాపూర్ ప్రాంతాలలో నిలువ ఉన్న చెత్తకుప్పలను తొలగించి ప్రజలను అంటు వ్యాధుల బారిన పడకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

పనబాకకు సన్మానం

బేగంబజార్, జూన్ 6 ప్రభాతవార్త

కేంద్రజౌళి శాఖ సహాయమంత్రిగా పనబాక లక్ష్మి పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్బంగా గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్‌కమిటీఉపాధ్యక్షులు జి నరేందర్ యాదవ్ కలిసి ఆమెను ఘనంగాసన్మానించారు. ఈసందర్బంగా నరేందర్ యాదవ్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా పనబాక లక్ష్మి కేంద్ర మంత్రిగా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలనుఅమలుచేయించడంలోఆమె ఎంతోపాటుపడ్డారన్నారు. ఆమె సేవలను గుర్తించిన ప్రజలు తిరిగి గెలిపించారని, సోనియాగాంధీ, మన్మోహన్ ఆశీర్వచనాలతో తిరిగి మంత్రి పదవిని అలంకరించారని నరేందర్‌యాదవ్ పేర్కొన్నారు.

అభినందనలు

ఆసిఫ్‌నగర్, జూన్ 6 ప్రభాతవార్త

రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా పదవీ భాధ్యతలుస్వీకరించినకిరణ్‌కుమార్‌రెడ్డిని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ నాయకులు టి సతీష్ కలిసి పుష్ప గుచ్చాన్ని అందించి అభినందనలు తెలిపారు. అనంతరం సతీష్ మాట్లాడుతూ స్పీకర్‌గా కిరణ్‌కుమార్‌రెడ్డి నియమితులవడం అభినందించదగ్గ విషయమన్నారు.

ఫోర్జరీ సంతకంతో 65వేలు డ్రా చేసుకున్న దుండగులు

మెహిదీపట్నం, జూన్ 6 ప్రభాతవార్త

ఫోర్జరీ సంతకాన్ని పెట్టి బ్యాంకులో నుంచి రూ.65వేలు డ్రా చేసుకెళ్లిన సంఘటన హుమాయున్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారంమాసబ్‌ట్యాంక్ శాంతినగర్ ప్రాంతానికి చెందిన సుబ్బారావ్ రిటైర్డ్ ఉద్యోగి. ఇతడు పశు సంవర్ధక శాఖలో పని చేసి ఇటీవలనే పదవీ విరమణ పొందారు. ఇతడు శనివారం అవసరం నిమిత్తం పించన్ డబ్బులను డ్రా చేసుకుందామని విజయనగర్ కాలనీలో ఉన్న ఎస్‌బిఐ బ్యాంకుకు వెల్లాడు. అక్కడికెళ్లి డబ్బులను డ్రా చేసుకోవాలని బ్యాంకు అధికారులను సంప్రదించగా నీ పేరుపై ఈ రోజే రూ.65వేలు డ్రా అయ్యాయని చెప్పారు. దీంతో ఖంగుతిన్న సుబ్బారావ్ బ్యాంకు అధికారులను నిలదీశారు. నా డబ్బులను ఇతరులకు ఎలా ఇస్తారని వాగ్వాదం చేశారు. దీంతో అతడి సంతకాన్ని పోల్చి చూడగా డ్రా చేసుకున్న వారు కూడా ఇతడి సంతకం వలే పెట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో తన సంతకాన్ని ఎవరో ఫోర్జరీ చేసి తన 65వేల రూపాయలను డ్రా చేసుకున్నారని తనకు అన్యాయం జరిగిందని, తనకు న్యాయం చేయాలని కోరుతూ సుబ్బారావ్ ముమాయున్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.